క్లుప్తంగా

అప్పన్నకు స్వర్ణతులసీ దళార్చన


స్వర్ణతులసీ దళాలతో ప్రదక్షిణ చేస్తున్న దేవాలయ అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం స్వర్ణతులసీ దళార్చన విశేషంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి ఈ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై కొలువుంచారు. ఉభయదాతలకు కంకణ ధారణ చేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ తులసీ దళాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలి


మాట్లాడుతున్న డీటీ అర్జునరావు

పెందుర్తి: ఓటు హక్కు వయసు వచ్చిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఎన్నికల విభాగ డెప్యూటీ తహసీల్దార్ వి.అర్జునరావు కోరారు. ఆర్ ఆర్ వెంకటాపురం సమీపంలోని అళ్వార్‌దాస్ కళాశాలలో మంగళవారం ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు ఎంతో విలువైనదని, 18 ఏళ్ల వయసు దాటిన ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో యువత పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. సదస్సులో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

16న అయ్యప్ప పడిపూజ



పెందుర్తి: సుజాతనగర్లోని పూర్ణ పుష్కళ సమేత శ్రీధర్మ శాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో 16న సన్నిధాన మహాపడిపూజ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, గురుస్వామి వాకా చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు అయ్యప్ప భక్తులంతా 108 క్షీర కలశాలతో చినముషిడివాడ గ్రామ దేవత పరదేశమ్మతల్లి ఆలయం నుంచి సుజాతనగర్ వరకు ఊరేగింపు ఉత్సవం నిర్వహిస్తారన్నారు. అనంతరం అయ్యప్పకు పంచామృతాభిషేకం, తొలి దివ్య దర్శనం, నిత్యపూజ, సాయంత్రం 6 గంటల నుంచి విష్ణు సహస్రనామ పారాయణం, సుబ్రహ్మణ్యస్వామి పూజ, అయ్యప్ప 18 మెట్ల పూజ, అయ్యప్ప అష్టోత్తర, ధూప దీప నైవేద్యం, రాత్రి 9.30 నుంచి పడి పూజ, మంత్ర పుష్పం, పవళింపు సేవ చేస్తామన్నారు. అనంతరం ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. భక్తులంతా తరలిరావాలని కోరారు.

సత్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు

పెందుర్తి: సాధుమఠం వద్ద కొలువైన రమా సత్యనారాయణస్వామి దేవాలయంలో కార్తీక మాస తొలి ఏకాదశి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేసి అర్చనలు జరిపారు. కుంభ హారతి, నక్షత్ర హారతి, బిల్వ హారతి, నంది హారతులందించారు. ఆలయ ప్రధాన అర్చకులు బి.మురళీశర్మ, ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.


అప్పన్న సేవలో ప్రముఖులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న రాజేంద్రకుమార్ దంపతులు, వాకాటి కరుణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వాకాటి కరుణ, సెంట్రల్ ఇన్‌కం ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వీరి పేరిట అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం, ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందజేశారు.

వరుస అల్పపీడనాలు, వాయుగుండాలు, తుపాన్లతో ఈ ఏడాది మత్స్యవేట ఆశాజనకంగా లేని పరిస్థితి. వేట నిషేధం ముగిసి, చేపల వేట ప్రారంభమైనా ఆశించినంత గొప్పగా లేదు. ఇప్పుడు చిరు చేపల సీజన్ మొదలయింది. కనీసం వీటితోనైనా కాసింత ఆదాయం పొందేందుకు మండలంలోని మత్స్యకారులు సిద్ధమయ్యారు. ముత్యాలమ్మపాలెం తీరం చిరు చేపల వేటకు చాలా అనుకూలం. పది రోజులుగా తీరంలో చిన్న చేపల వేట జోరందుకుంది. అయితే దళారుల కుమ్మక్కుతో ధర మాత్రం ఆశించినంతగా లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వేటాడి తెచ్చిన చిరుచేపలను తీరంలో ఎండబెడుతున్న మత్స్యకార్మికులు

చిరు చేపలే ఆధారం

- ముత్యాలమ్మపాలెం తీరంలో కవ్వళ్ల సీజన్
- 840 కుటుంబాలకు జీవనాధారం
- ఆశించినంత ధర లేదని మత్స్యకారుల ఆవేదన


బోటులో వేటాడి తెచ్చిన చిరుచేపలు

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మపాలెం తీరంలో చిరుచేపల సీజన్ మొదలైంది. ప్రధానంగా కవ్వళ్ల వేట జోరందుకుంది. పది రోజులుగా మత్స్యకారుల వలకు ఈ చిన్న చేపలు ఇబ్బడి ముబ్బడిగా చిక్కుతున్నాయి. దసరా నుంచి మొదలయ్యే ఈ సీజన్ సంక్రాంతి వరకు కొనసాగుతుంది. ఈసారి కాస్త ఆలస్యంగా సీజన్ ప్రారంభమైంది. చిరు చేపల వేటకు తీరానికి 10–30 కి.మీ. దూరాన్ని మించి పోనక్కర్లేదు. రోజుల తరబడి సముద్రంలో వేట సాగించాల్సిన పనిలేదు. రాత్రి బయల్దేరితే.. మరుసటి రోజు సాయంత్రంలోగా తీరానికి తిరిగొచ్చేయొచ్చు. ఏ మాత్రం వాతావరణం అటూఇటుగా ఉన్నా అప్రమత్తం కావొచ్చు.

840 కుటుంబాలకు ఉపాధి

ముత్యాలమ్మపాలెం తీరం వెంబడి మత్స్యవేటలో ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. 140 బోట్లతో చేపల వేట సాగిస్తున్నారు. సుమారు 840 కుటుంబాలకు ఇవే జీవనాధారం. పది రోజులుగా పెద్ద చేపల వేటకు వెళ్లట్లేదు. చిన్న చేపల వేటపైనే దృష్టిసారిస్తున్నారు. రోజూ రాత్రి భోజనం చేసి 'అలివి'వలల్ని వెంటబెట్టుకుని ఒక్కో బోటులో ఆరుగురు చొప్పున వేటకు వెళ్తున్నారు. రాత్రంతా వేటలో పాల్గొని తెల్లవారు జామున తిరిగి ఒడ్డుకు చేరుకుంటారు. చేపలు ఆశించినంతగా చిక్కకపోతే కొన్నిసార్లు మధ్యాహ్నం వరకూ వేటసాగిస్తారు. వేటలో చిక్కిన మత్స్య సంపదను విక్రయించగా వచ్చిన సొమ్మే వీరికి జీవనాధారం.

ఆదమరిస్తే.. వలలకు నష్టం

చిరుచేపల వేటకు తీరం నుంచి గరిష్టంగా 30 కిలోమీటర్ల దూరం వెళతారు. ఈ చేపలు రాళ్లు ఉన్న ప్రదేశాల్లోనే ఎక్కువగా ఉంటాయి. వాటి జాడ ఆధారంగా వేట సాగిస్తారు. కొన్నిసార్లు ఆశించినంతగా చేపలు దొరికే పరిస్థితి ఉండదు. అలాంటపుడు డీజిల్ ఖర్చు కూడా రాదని మత్స్యకారులు చెప్తున్నారు. చేపల జాడ తెలియకుండా వల వేస్తే వల బయటకు తీసే సమయంలో రాళ్లకు తగిలి లక్షల విలువైన వల నష్టపోవాల్సి వస్తుంది. గంగవరం, పూడిమడక ప్రాంతాల వైపు రాళ్లు అధికంగా ఉన్న ప్రదేశాల్లో ఈ చిరు చేపల వేటను సాగిస్తారు. వేటాడి తెచ్చిన ఈ చిన్న చేపల్ని తీరంలో రెండు రోజులు ఆరబెట్టి బుట్టల వంతున విక్రయిస్తారు.

ఎండు చేపలకు గిరాకీ

చిరు చేపల్ని ఎక్కువగా ఎండబెట్టి, సీజన్‌తో పనిలేకుండా విక్రయించేందుకు సిద్ధం చేస్తారు. ఎండు చేపలకు ఎగుమతి డిమాండ్ ఎక్కువ. తక్షణ ఆదాయం కోసం కొంత మేరకు మత్స్యకార మహిళలు బుట్టల్లో ఈ చేపల్ని తీసుకెళ్లి ఊరూరా తిరిగి చిల్లర అమ్మకాలు జరుపుతారు.

చాలా వరకు వేటాడి తెచ్చిన చేపల్ని రెండు రోజులు ఆరబెట్టి బుట్టల్లెక్కన విక్రయిస్తారు. 40–50 కిలోల మధ్య ఉండే బుట్ట చేపలకు రూ.1650 ధర పలుకుతోంది. దళారులు వీటిని కొనుగోలు చేసి కోళ్ల ఫారాల యజమానులకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కిలోకు రూ.35కు మించి రాకపోవడంతో కొందరు మత్స్యకారులు ఎండు చేపలపై దృష్టి సారిస్తున్నారు. తీరంలోని ఇసుక తిన్నెలపై వలల్ని పరిచి, వాటిపై చేపల్ని ఎండబెట్టి ఎగుమతి చేయడం ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చని మత్స్యకారులు చెప్తున్నారు.

అదృష్టం బాగుంటేనే డబ్బులు



అదృష్టం బాగుంటే చిరుచేపల వేటలో నాలుగు డబ్బులు కళ్ల జూస్తాం. లేకుంటే నష్టాలు చవిచూడక తప్పదు. రాత్రి వేళలో నిద్రాహారాలు మాని చేపల వేటకు వెళతాం. వేటలో వలకు చేపలు దండిగా చిక్కితే పర్లేదు. లేకుంటే డీజిల్ ఖర్చుల భారం భరించాల్సిందే. సీజన్ ఇప్పుడే మొదలయింది. ప్రస్తుతం వలలకు తక్కువగానే చిన్న చేపలు చిక్కుతున్నాయి. సంక్రాంతి వరకు ఈ సీజన్ ఉంటుంది.

– సూరాడ మసేను, మత్స్యకారుడు

ఆశించిన ధర లేదు



చిరు చేపల ధరలు ఆశించినంతగా లేవు. కష్టానికి తగిన ప్రతిఫలం దక్కడం లేదు. ప్రస్తుతం దళారులు కిలో రూ.35కు అటూఇటుగా కొనుగోలు చేస్తున్నారు. కిలో చేపలు రూ.50–60లకు పైబడి ధర పలికితేనే కాస్త గిట్టుబాటవుతుంది. తరచూ వెంటాడుతున్న తుపాన్లు, ప్రకృతి విపత్తుల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నాం. అలాంటి సమయాల్లో చేపల వేట సాగక ఇళ్ల వద్దే కాలం గడుపుతున్నాం.

– మేరుగు నర్సయ్య, మత్స్యకారుడు

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం


గంగాధర్ దంపతుల్ని సత్కరిస్తున్న బాపడుపాలెం గ్రామ పెద్దలు

పరవాడ: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, భర్నికం శివారు బాపడుపాలెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కొరుప్రోలు గంగాధర్‌ను గ్రామ ప్రజలు మంగళవారం ఘనంగా సత్కరించారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం చంద్రబాబునాయుడి చేతుల మీదుగా అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు గ్రామ మాజీ సర్పంచ్ బొండా తాతారావు, మాజీ ఉప సర్పంచ్ దాట్ల నాగమణి గణేష్ రాజు, గ్రామ పెద్దలు గంగాధర్ దంపతుల్ని శాలువా వేసి సన్మానించారు. విద్యార్థుల పట్ల ఆయన నిబద్ధతను కొనియాడారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

పరవాడ: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల పంచాయతీ విస్తరణాధికారి కె.ధర్మారావు మంగళవారం తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులకు గ్రామావసరాల మేరకు ప్రణాళికలు రూపొందించడంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

సబ్బవరం: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పద్మజ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగే ఈ శిక్షణలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, వెలుగు సిబ్బంది పాల్గొంటారన్నారు. ఈ నెల 14న ఎంపీటీసీలు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

విజిలెన్స్ వారోత్సవాల్లో చిత్రలేఖన పోటీలు


చిత్రలేఖనం విజేతలతో పవర్ గ్రిడ్ సీనియర్ జీఎం సూర్యచంద్రరావు

పరవాడ: విద్యార్థులు విద్యతో పాటు గురువులను, తల్లిదండ్రులను గౌరవించడం అలవర్చుకోవాలని ఉక్కునగరం పవర్‌గ్రిడ్ సంస్థ సీనియర్ జనరల్ మేనేజర్ టి.సూర్యచంద్రరావు అన్నారు. దేశపాత్రునిపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విజిలెన్స్ వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న 63 మంది విద్యార్థుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కోమలిక, చంద్రశేఖర్, కనకమహాలక్ష్మి గెలుచుకున్నారు. విజేతలకు బహుమతులు అందించారు. రూ.15 వేల విలువైన స్టీల్ కంచాలు, గ్లాసులను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భారతి, పవర్‌గ్రిడ్ చీఫ్ మేనేజర్ రాధామనోహర్, మేనేజర్ అమరదీప్, ప్రతినిధులు పైల అప్పారావు, కమిటీ చైర్మన్ స్వప్న, గ్రామ నాయకులు నాగిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక


జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: విశాఖలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి మంగళవారం మీడియాకు తెలిపారు. ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన వి.తేజేష్, శ్యామ్‌కుమార్, పి.తేజస్వరూప్, డి.నిఖిల్, ఆర్.సుప్రతిక్, ఎం.సంపత్, జె.జయదీప్, సాహిల్ గోవింద్, హిమ ప్రభాస్, బి.లాస్య, కె.అతిక్షనారాయణ, డి.బెర్నికప్రజ్ఞ, ఐ.వైష్ణవిలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఢిల్లీలో ఈ నెల 14 నుంచి 17 వరకు జరిగే ఈ పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల సీఈవో కె.నిశాంత్ అభినందించారు. శిక్షణ అందిస్తున్న బి.హరినాథ్‌రెడ్డిని పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి ప్రత్యేకంగా ప్రశంసించారు.

ముగిసిన గ్రామ రెవెన్యూ సదస్సులు

- 20 సదస్సుల్లో రైతుల నుంచి 1,851 అర్జీలు
- 15 రోజుల్లో సమస్యల పరిష్కారం
- తహసీల్దార్ చిన్నికృష్ణ


బలిజపాలెం గ్రామ రెవెన్యూ సదస్సులో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: రైతుల భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులు మంగళవారం బలిజపాలెం సదస్సుతో ముగిశాయి. సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ బి.చిన్నికృష్ణ రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రీ సర్వే జరిగిన 20 గ్రామాల్లో నిర్వహించిన ఈ సదస్సుల ద్వారా వివిధ సమస్యలపై రైతుల నుంచి వచ్చిన 1,851 అర్జీలను స్వీకరించినట్లు వెల్లడించారు. గ్రామ సభలు పూర్తయిన 15 రోజుల్లో రైతుల అర్జీలను పరిష్కరిస్తామన్నారు. అధికారులు ఆయా గ్రామాల్లోని రైతుల సమక్షంలోనే వారి సమస్యలను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. చిన్నచిన్న సమస్యలపైనే అధిక శాతం అర్జీలు వచ్చాయన్నారు. రైతుల నుంచి భూ రికార్డుల్లో తక్కువ విస్తీర్ణం నమోదు పేరిట 999 అర్జీలు, సబ్ డివిజన్‌పై 22, పేర్లు తప్పుగా నమోదయ్యాయని 135, సర్వే నంబర్ల పొరపాటుపై 36, వెబ్‌ల్యాండ్ నమోదుపై 434, పంపకాలపై 37, తప్పుడు ఎంట్రీలపై 19, ఫొటోల తప్పులపై 37, డీఎల్ఆర్ ఎంట్రీపై 26, ఇతర సమస్యలపై 106 అర్జీలు దాఖలు చేసుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణేష్, సర్పంచ్ మామిడి శంకరరావు, ఎంపీటీసీ మామిడి లక్ష్మి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు గొర్లి నూకరాజు, గ్రామ పెద్దలు మామిడి కొండాజీ, వీఆర్వో అనంత్, సర్వేయర్లు రాంబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటాద్రిపై కార్తీక ఏకాదశి పూజలు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి


వేంకటాద్రి క్యూలైన్లలో భక్తుల రద్దీ

పెందుర్తి: కార్తీకమాస బహుళ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి సుప్రభాతసేవ, తోమాల సేవ చేశారు. అర్చకుడు మహర్షి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వెంకన్నకు అష్టోత్తర పూజలు జరిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కొండ దిగువ నుంచి స్వామి సన్నిధి వరకు ఉచిత వాహన సదుపాయం కల్పించారు. భారీ ఎత్తున ప్రసాద వితరణ చేపట్టారు. ఈవో ఎం.నీలిమ, ఆలయ కమిటీ చైర్మన్ రాజు, అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు

సబ్బవరం పోలీస్ స్టేషన్లో అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా


పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

సబ్బవరం: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం సందర్శించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల, ముఖ్యంగా నిరుపేదలు, వృద్ధులు, మహిళల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రమాద నియంత్రణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, నాటు సారా తయారీపై కఠినంగా ఉండాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కలిగించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తరచూ ఫిర్యాదులు వస్తున్న నేరాల గురించి ఆరా తీశారు. పెండింగ్ కేసుల ఫైళ్లను పరిశీలించి, ఆయా కేసుల పురోగతిని తెలుసుకుని తగు సూచనలు చేశారు. రౌడీ షీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రతి పోలీస్ ఓ ఇన్వెస్టిగేషన్ అధికారిలా పనిచేయాలని ఆదేశించారు. సిబ్బందిని అడిగి, స్టేషన్‌తో పాటు విధుల్లో ఉండే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి వినియోగం, అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఏజెన్సీ నుంచి రవాణా చేయకుండా నియంత్రించేందుకు వి.మాడుగుల, చీడికాడ, కేడీ పేట తదితర ప్రదేశాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ముందుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆయన సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆయన వెంట పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ పిన్నింటి రమణ, ఎస్‌ఐలు సింహాచలం, దివ్య తదితరులున్నారు.

పెంచిన ధరలు తగ్గించాలని సీపీఎం ధర్నా


ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు

సింహాచలం: రాష్ట్రంలో నిత్యావసర సరకులు, పెట్రోల్, డీజిల్ ధరలను, విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ నాయకుడు బి.వెంకటరావు డిమాండ్ చేశారు. 98వ వార్డు అడవివరంలోని 524, 529 సచివాలయాల వద్ద గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరకులు, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దానికి తోడు ఇప్పుడు కొత్తగా విద్యుత్ చార్జీలను పెంచడం చాలా దారుణమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఉపసహరించుకోవాలని, సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల తొలగింపుని ఉపసంహరించుకుని, కార్మిక హక్కులపై దాడుల్ని ఆపాలన్నారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, వేధింపులను అరికట్టి, వారికి రక్షణ కల్పించేందుకు కఠిన చట్టాలు అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. జమిలి ఎన్నికలను వైఎస్సార్‌సీపీ, జనసేన, తెలుగుదేశం పార్టీలు వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ముద్దాడ ప్రసాద్, సూర్యకాంతం, డి.వి.రమణ, ఆర్.శ్రీనివాసరావు, ఎం.రాము నాయుడు, కె.అప్పారావు, చిన్నారావు పాల్గొన్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు రేష్మ



సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని రేష్మ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) అండర్–19 విభాగంలో జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తి మంగళవారం మీడియాకు తెలిపారు. రేష్మ తమ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోందన్నారు. గుంటూరులోని సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని, ప్రతిభ చూపడంతో జాతీయ పోటీలకు ఎంపికయిందన్నారు.